
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి మెదక్ జిల్లాల వార్తలు
5
సోమవారం 24 మార్చి 2025



రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:33 (సోమవారం సాయంత్రం)
సహర్: 4:54 (మంగళవారం ఉదయం)



రేగోడులో కురుస్తున్న వర్షం

గాలివాన

హవేళిఘణపూర్/రేగోడు, మార్చి23 (ఆంధ్రజ్యోతి) : హవేళిఘణపూర్, రేగోడు మండలాల్లోని పలు గ్రామాల్లో ఆదివారం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ వేడిమి, ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. మధ్యాహ్నం తరువాతం ఆకాశం మేఘావృతమై ఈదురుగాలు, వడగళ్లతో కూడిన వాన పడింది. రేగోడులో 20 నిమిషాల పాటు కునిసిన వానతో రోడ్లపై వర్షపు నీరు పారింది. పలుటచోట్ల ఈ వడగల్ల వర్షానికి చాలా పంటలకు మేలు కాగా, మరికొన్ని పంటలకు నష్టం వాటిల్లింది. దీంతో కొందరు రైతులు సంబుర పడుతుంటే మరికొంత మంది బాధపడుతున్నారు. కూరగాయలు, జొన్న పంటలకు నష్టం కలుగుతుందని రైతులు వాపోతున్నారు.



సంగారెడ్డిలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో పాల్గొని ముస్లింలకు ఈద్ ముబారక్ చెబుతున్న జగ్గారెడ్డి



ఇఫ్తార్ విందులో జగ్గారెడ్డికి పండ్లు తినిపిస్తున్న మాజీ కౌన్సిలర్ షఫీయొద్దీన్

ఇఫ్తార్ విందులో జగ్గారెడ్డి

ముస్లిం సోదరులకు ఈద్ ముబారక్ చెప్పిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్

సంగారెడ్డి టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని సంగారెడ్డిలో శనివారం రాత్రి నిర్వహించిన ఇఫ్తార్ విందులో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పాల్గొన్నారు. పట్టణంలోని నాల్‌సాబ్‌గడ్డకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కుత్బోద్దీన్ నివాసంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు జగ్గారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి పండ్లు తినిపించి, వారికి ఈద్ ముబారక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కూన సంతోష్, షఫీయొద్దీన్, తాహేర్‌పాషా, ఆరీఫ్, మసూద్, షాహీద్, ఫర్వేజ్ తదితరులు పాల్గొన్నారు.

మనోహరాబాద్ మండలం కాళ్లకల్‌లో ఒక పరిశ్రమకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా కోసం ఏఈ కృష్ణ పరిశ్రమ యజమానిని రూ.50 వేలు డిమాండ్ చేశాడు. బేరసారాల అనంతరం రూ.30 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. జనవరి 17న మొదటి దఫా రూ.10 వేలు ఏఈకి ఇచ్చారు. అనంతరం ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. మిగతా రూ.20 వేలు కాళ్లకల్ విద్యుత్ కార్యాలయంలో ఏఈకి ఇస్తుండగా వలపన్ని పట్టుకున్నారు. నిందితుడిని నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరు పర్చి రిమాండ్‌కు తరలించారు.

మెదక్ మున్సిపల్ ఏఈ జానయ్య ఓ మహిళకు సంబంధించిన ప్లాట్ మ్యూటేషన్ చేయడం కోసం రూ.12 వేలు డిమాండ్ చేశాడు. బాధితులు ఏసీబీని ఆశ్రయించారు. ఈనెల 11వ తేదీన మున్సిపల్ కార్యాలయంలో మహిళ బంధువు ఆర్ఐకి డబ్బు ఇస్తుండగా వల పన్ని ఏసీబీ పట్టుకున్నది.

నిరుపేద మహిళా రైతు తనకున్న కొద్దిపాటి భూమిని పౌతి చేయించుకోవడానికి దుబ్బాక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న నర్సింహారెడ్డిని ఆశ్రయించింది. అందుకు ఆయన రూ.50 వేలు డిమాండ్ చేశాడు. ఆమె బంధువు రఘోత్తంపల్లి మాజీ సర్పంచ్ రెడ్డి దేవిరెడ్డి మధ్యవర్తిగా వ్యవహరించగా.. ఆర్ఐ రూ.50 కాదు రూ.లక్ష కావాలని కోరాడు. డబ్బు ఇవ్వడానికి అంగీకరిస్తూనే వారు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఫిబ్రవరి 12న డబ్బు ముట్టజెపుతూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టించారు.

పెద్దశంకరంపేటకు చెందిన ఓవ్యాపారి ప్రతీ నెలా జీఎస్టీ రిటర్న్స్ చేయకపోవడంతో అధికారులు రిజిస్ట్రేషన్‌ను తాత్కాలికంగా నిలిపివేశారు. పునరుద్దరణ కోసం జిల్లా కేంద్రంలోని సెంట్రల్ జీఎస్టీ కార్యాలయ సూపరింటెండెంట్‌ను రవిరాజన్ అగర్వాల్ సంప్రదించాడు. అతడు వ్యాపారి నుంచి రూ.10 వేలు డిమాండ్ చేశాడు. ముందుగా రూ.8 వేలు ఆన్‌లైన్ ద్వారా చెల్లించాడు. ఆ తర్వాత సీబీఐ అధికారులకు ఫిర్యాదు చేశాడు. శుక్రవారం సీబీఐ ఇన్‌స్పెక్టర్ నేతృత్వంలో సిబ్బంది జీఎస్టీ కార్యాలయంలో తనిఖీలు నిర్వహించి రవిరాజన్‌ను అదుపులోకి తీసుకున్నారు.

అవినీతి జలగలు

- మూడు నెలల్లో ఏసీబీ వలలో ముగ్గురు
- తాజాగా సీబీఐ చిక్కిన జీఎస్టీ సూపరింటెండెంట్



మెదక్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : కొందరు ప్రభుత్వ ఉద్యోగులు లంచావతారులుగా మారుతున్నారు. ప్రజలకు ఆదర్శంగా నిలవాల్సిన వారే సులువుగా డబ్బు సంపాదించేందుకు అడ్డదారులు తొక్కుతూ ఏసీబీకి చిక్కుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో కింది స్థాయి ఉద్యోగుల నుంచి పైస్థాయి అధికారుల వరకు కాసులు ఇవ్వనిదే కనికరించడంలేదు. పౌతీ, పట్టామార్పిడి, పాస్‌బుక్, మ్యుటేషన్, విద్యుత్ మీటర్లు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల కోసం ఇలా ప్రతీ పనికి ప్రతీ ప్రభుత్వ శాఖలో అవినీతిపరులు అందికాడికి దండుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో మూడు నెలల్లో ముగ్గురు అధికారులు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. తాజాగా, శుక్రవారం ఓ వ్యాపారి నుంచి మెదక్ రేంజ్ జీఎస్టీ అధికారి ఆన్‌లైన్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయించుకుని ఏకంగా సీబీఐకి పట్టుబడ్డాడు. ఇలా పట్టుబడిన వారు కొందరే అయితే, దొరకని వారు ఎందరో ఉన్నారు. ఓ పక్క ఏసీబీకి పట్టుబడుతున్నా ఉద్యోగుల తీరులో మాత్రం మార్పు కనిపించడం లేదు.

అవినీతిపరుల కొత్త మార్గాలు

ఏసీబీకి ఎవరైనా చిక్కితే అవినీతి అధికారుల్లో గుబులు మొదలవుతుంది. కానీ, డబ్బు కోసం అడ్డదారులు తొక్కడంలో ఆరితేరిన అధికారుల్లో ఏమాత్రం భయం కనిపించడం లేదు. తమ తీరును మార్చుకోవడం లేదని విమర్శలు ఎదురవుతున్నాయి. ఏసీబీ నిఘా పెంచినా కొందరు డబ్బులకు కక్కుర్తి పడే అధికారులు మరిన్ని జాగ్రత్తలు తీసుకుని తమ పని సజావుగా సాగేందుకు కొత్త మార్గాలను అన్వేషిస్తునే ఉన్నారు. గతంలో మధ్యవర్తులను ఆశ్రయించేవారు. ఏసీబీ ప్రస్తుతం మధ్యవర్తులను సైతం అరెస్ట్ చేస్తుండడంతో తాజాగా ఆన్‌లైన్ చెల్లింపుల బాట పడుతున్నారు. ఇటీవల ఆన్‌లైన్ బ్యాంక్ ట్రాన్స్‌ఫర్, యూపీఐ పేమంట్లు బాగా పెరిగిన విషయం తెలిసిందే. వీటిని అవినీతి అధికారులు వీటిని యథేచ్ఛగా వినియోగించుకుంటున్నారు. ఆన్‌లైన్ పేమెంట్ ద్వారా డబ్బును ట్రాన్స్‌ఫర్ చేయుంచుకుంటే దొరకరని భావిస్తున్నారు. తాజాగా సీబీఐకి పట్టుబడిని సెంట్రల్ జీఎస్టీ సూపరింటెండెంట్ వ్యాపారి దగ్గర నుంచి ఆన్‌లైన్ మార్గంలోనే రాబట్టుకున్నాడు. కానీ అతని ఎత్తు పారలేదు. మరో వారం రోజుల్లో మెదక్ నుంచి ట్రాన్స్‌ఫర్ అవనున్న తరుణంలో సీబీఐకి పట్టుబడడం విశేషం. బాధ్యతాయుత పౌరుల ఫిర్యాదుతోనే ఇది సాధ్యమైంది.



మెదక్ రేంజ్ జీఎస్టీ సూపరింటెండెంట్ రవిరాజన్ అగర్వాల్‌ను అరెస్టు చేసిన సీబీఐ అధికారులు

ఫిర్యాదు చేయండి

లంచం తీసుకోవడం ఎంత నేరమో, ఇవ్వడమూ అంతే నేరంగా పౌరులు గుర్తుంచుకోవాలి. జిల్లాలో ఇటీవల పట్టుబడిన నలుగురి విషయంలో పౌరులు బాధ్యతయుతంగా వ్యవహరించారు. అధికారులు తమ పనికోసం డబ్బులు డిమాండ్ చేయగా, వారిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టించి తమ కర్తవ్యాన్ని నెరవేర్చారు. ఇలా అవినీతిని ప్రోత్సహించకుండా డబ్బులడిగిన అధికారులపై అవినీతి నిరోధక శాఖాధికారులకు ఫిర్యాదు చేయాలి. అప్పుడే లంచావతారులలో భయం మొదలవుతుంది.. ఇలాగైనా కొంతవరకైనా అవినీతిని నిర్మూలించడం సాధ్యమవుతుంది.



వాటర్‌షెడ్ పనులను గురించి వివరిస్తున్న మర్రి శశిధర్‌రెడ్డి

చతుర్విధ ప్రక్రియతో భూగర్భజలాల పెంపు

జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ మాజీ వైస్ చైర్మన్ మర్రి శశిధర్‌రెడ్డి

కోహీర్, మార్చి 23ః (ఆంధ్రజ్యోతి) చతుర్విద జల ప్రక్రియతోనే భూగర్భ జలాలను పెంచడం సాధ్యమవుతుందని జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ మాజీ వైస్ చైర్మన్, బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు మర్రి శశిధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని గొటిగర్‌పల్లి గ్రామంలో వాటర్‌షెడ్ పనులను మహారాష్ట్రకు చెందిన చీఫ్ ఇంజనీర్ విజయ్ దేవరాజ్ బృందం పరిశీలించేందుకు వచ్చారు. వారికి శశిధర్‌రెడ్డి పనుల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2001-2002 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం నీటి భద్రతలో భాగంగా నీరు-మీరు కార్యక్రమం ద్వారా రూ.30 లక్షలతో చేపట్టిన వాటర్‌షెడ్ చేపట్టడం జరిగిందన్నారు. అప్పట్లో విశ్రాంత ఇంజనీర్ ఇన్ చీఫ్, జలవనరుల నిపుణులు టి.హనుమంతరావు మట్టికట్టలతో చతుర్విద జలప్రక్రియ కార్యక్రమంపై పూర్తి అవగాహన కల్పించారు. ఇక్కడ వాటర్ షెడ్ పనులు చేపట్టిన తర్వాతనే భూగర్భ జలాలు పెరిగాయి. దేశంలోని అన్ని రాష్ట్రాలలో వాటర్‌షెడ్ పనులు చేపట్టి భూగర్భజలాలు పెంచాలన్నారు. మన రాష్ట్రంలోనూ వాటర్‌షెడ్ పనులు చేపట్టాలని ఇటీవల ముఖ్యమంత్రికి లేఖ రాయడం జరిగిందన్నారు. ఎడారి ప్రాంతమైన రాజస్థాన్‌లోనూ చతుర్విద జల ప్రక్రియతోనే భూగర్భజలాలు పెంచిన సందర్భాలు ఉన్నాయని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ అధ్యాపకులు శ్రీధర్ చౌహన్, సోలంకిజీ, తనుశ్రీ రజిని అప్సర్, గ్రామ మాజీ సర్పంచ్ రాచయ్య గ్రామ రైతులు తదితరులు ఉన్నారు.



ఉల్లి పువ్వు.. కనువిందు

తెల్లగా గుండ్రంగా ఈ ఫొటోలో కనిపిస్తున్నవి ఉల్లిగడ్డ పువ్వులు. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని చింతలఘట్టు గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఓ రైతు తన పొలంలో ఉల్లి విత్తనాల కోసం పంటను సాగు చేస్తున్నాడు. విత్తనాలు వచ్చే ఈ ఉల్లి పువ్వులు వికసించడంతో ప్రధాన రహదారి పక్కన చూపరులను కనువిందు చేస్తున్నాయి. - కోహీర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి)



'టీబీ' కలవరం

అప్రమత్తత అవసరం

- చాపకింద నీరులా వ్యాపిస్తున్న 'క్షయ'
- మొక్కుబడిగా అవగాహన కార్యక్రమాలు
- రోగులకు నిలిచిన నగదు జమ
- నేడు 'ప్రపంచ క్షయ నివారణ దినం'

7

కిక్కిరిసిన కొమురవెల్లి

- చివరివారం భారీగా తరలివచ్చిన భక్తులు

చేర్యాల/జగదేవ్‌పూర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయం వేలాదిమంది భక్తులతో జనమయమైంది. మల్లన్న మూడునెలల జాతరలో భాగంగా చివరివారం కావడంతో పాటు అగ్నిగుండాలను తిలకించేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి మల్లన్నను దర్శించుకుని ప్రత్యేకపూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. వీరశైవుల జగద్గురు బర్దిపూర్ దత్తగిరిపీఠం మహామండలేశ్వర డాక్టర్ సిద్దేశ్వరానందగిరి మహాస్వామి పర్యవేక్షణలో సాయంత్రం ఆలయ ఆవరణలోని తోటబావి ప్రాంగణంలో వీరభద్ర పళ్లెరం, భద్రకాళి పూజలు నిర్వహించగా అర్ధరాత్రి అగ్నిగుండాలను నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారు. జగదేవ్‌పూర్ మండలం తిగుల్‌నర్సాపూర్‌లో కొండపోచమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించు కుని పూజలు నిర్వహించారు. ఆదివారం చివరివారం కావడంతో ఉదయం కొమురవెల్లి మల్లన్నను దర్శించుకున్న భక్తులు కొండపోచమ్మను దర్శించుకుని అమ్మవారికి బోనం సమర్పించి ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు.



క్యూలో బారులు తీరిన భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

వనదుర్గామాత ఆలయం.. భక్తిపారవశ్యం

పాపన్నపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : ఏడుపాయల వనదుర్గామాత ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఆదివారం వారాంతపు సెలవు రోజు కావడంతో ఉమ్మడి జిల్లా వాసులతో పాటు పరిసర జిల్లాలు, జంట నగరాలు, పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్రల నుండి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు అమ్మనామస్మరణతో మార్మోగాయి. తెల్లవారుజామున 5.30 గంటలకు అర్చకులు అమ్మవారికి అభిషేకం చేపట్టి సహస్రనామార్చన, కుంకుమార్చన అనంతరం దర్శనం కల్పించారు. మంజీరా నదీపాయల్లో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు మాతను దర్శించుకున్నారు. బోనాలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పేదల కోసమే విద్య, వైద్య సేవల విస్తరణ

- ఏడు అంబులెన్సులు అందజేత.. మెదక్ ఎంపీ రఘునందన

7

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



శివ్వంపేట/సంగారెడ్డి రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కొంతాన్‌పల్లి జడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో 2007-08లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు, సంగారెడ్డి మండలం కులబ్‌గూర్ గ్రామ సమీపంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో 2011-12లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు.

డంపుయార్డు దిగులుతో
ఆగిన గుండె



రిలేదీక్షలో కృష్ణ (ఫైల్)

గుమ్మడిదల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదల మండలం ప్యారానగర్‌లో నిర్మించ తలపెట్టిన డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయ్యవద్దని కోరుతూ మనోవేదనకు గురైన ఓ వ్యక్తి గుండె ఆగిపోయింది. ఈ సంఘటన ఆదివారం నాడు నల్లవల్లి గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం ప్రకారం గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి గ్రామానికి చెందిన నడిమింటి కృష్ణ (53) గుండెపోటుతో మృతి చెందాడు. గత కొన్ని రోజులుగా మృతుడు డంపింగ్ యార్డ్ వ్యతిరేక ఉద్యమంలో చాలా చురుకుగా పాల్గొన్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కూతురుకు ఈ మధ్యనే పెళ్లి కుదిరినట్లు తెలిసింది. కాగా డంపు యార్డు ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో తనకున్న కొద్ది పొలంతో ఎలాంటి లాభం రాదని మనవేదనకు గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో డంపు యార్డు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంలో రజక సంఘం తరఫున రిలే నిరాహార దీక్షలో సైతం పాల్గొన్నాడు. ఈ విషయమై ఆదివారం ఉదయం రోదిస్తు ఉండగా ఒక్కసారిగా గుండె నొప్పి వచ్చి స్పృహ తప్పి పడిపోయాడు. దీంతో కుటుంబీకులు అతడిని హుటాహుటిన నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ప్రభుత్వం బాధితుడి కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.

ప్రియుడితో కలిసి భర్త హత్యకు ప్లాన్

- కారుతో ఢీకొట్టి చంపేందుకు యత్నం
- తప్పించుకుని పోలీసులను ఆశ్రయించిన భర్త



పోలీసుల అదుపులో నిందితులు

మునిపల్లి, మార్చి23 (ఆంధ్రజ్యోతి) : ప్రియుడిపై మోజుతో భర్తనే హత్య చేసేందుకు ప్లాన్ చేసింది ఓ భార్య. మునిపల్లి ఎస్ఐ రాజేష్ నాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. సంగారెడ్డి జిల్లా మునిపల్లి పెద్ద గోపులారం గ్రామానికి చెందిన కొంపట్‌పల్లి రవి వ్యక్తి ఝరా సంగం మండలం దౌరంపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాడు. 2021లో సంగారెడ్డికి చెందిన హరితను వివాహం చేసుకున్నాడు. హరిత చదువుకుంటున్న సమయంలో సంగారెడ్డికి చెందిన క్లాస్‌మెట్ మిరుదొడ్డి సాయిప్రదీప్‌ను ప్రేమించింది. రవితో పెళ్లి అయినప్పటికీ ఆమె సాయిప్రదీప్‌తో సంబంధాలు కొనసాగిస్తూ వచ్చింది. ఈ క్రమంలో భర్తను అడ్డు తొలగించుకోవాలన్న ఉద్దేశంతో రవిని హతమార్చేందుకు ప్రియుడు సాయిప్రదీప్‌తో కలిసి ప్లాన్ చేసి సరైన సమయం కోసం ఎదురు చూసింది. రవి రోజు మాదిరిగా శనివారం దౌరంపల్లి గ్రామంలో విధులు ముగించుకొని రాత్రి బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. ఇదే అదునుగా భావించిన సాయిప్రదీప్ తన స్నేహితుడైన సాయికిరణ్‌తో కలిసి థార్ కారుతో వెంబడించారు. పెద్దగోపులారం చౌరస్తాలోని ఆశ్రమం వద్దకు రాగానే కారుతో రవిని ఢీకొట్టారు. ప్రమాదాన్ని పసిగట్టిన రవి వెంటనే తప్పించుకొని నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం సాయంతో కంకోల్ టోల్‌ప్లాజా వద్ద నేరస్తులను అదుపులోకి తీసుకుని విచారించారు. తమ సంబంధానికి అడ్డు తొలగించుకోవాలనే భార్య మార్గదర్శకంలో రోడ్డు ప్రమాదంలో రవిని అంతమొందించేందుకు యత్నించామని వారు అంగీకరించారని ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు హరిత, సాయిప్రదీప్, సాయికిరణ్‌లపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.



హత్యాయత్నానికి వినియోగించిన కారు



'టీబీ' కలవరం!

అప్రమత్తత అవసరం

- చాపకిందనీరులా వ్యాపిస్తున్న 'క్షయ'
- మొక్కుబడిగా అవగాహన కార్యక్రమాలు
- రోగులకు నిలిచిన నగదు జమ
- నేడే 'ప్రపంచ క్షయ నివారణ దినం'

సంగారెడ్డి అర్బన్/సిద్దిపేట టౌన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి) : క్షయ(టీబీ) వ్యాధిని ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా ప్రాణానికే ప్రమాదం. దగ్గు రూపంలో ఒకరి నుంచి మరొకరికి సోకే ఈ వ్యాధి నిదానంగా ప్రాణాలనే బలి తీసుకుంటుంది. సంగారెడ్డి జిల్లాలో ఏటా క్షయ వ్యాధితో సుమారు 60 మంది వరకు మరణిస్తున్నట్లు అధికారిక లెక్కలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో నేడు 'ప్రపంచ క్షయ నివారణ దినం' సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

పెరుగుతున్న కేసులు

సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలో క్షయ కేసులు ఏటా పెరుగుతున్నాయి. ఇందుకు వైద్య, ఆరోగ్య శాఖ ఇచ్చిన గణాంకాలే నిదర్శనం. సంగారెడ్డి జిల్లాలో 2018లో 1476 కేసులు, 2019లో 1798 కేసులు, 2020లో 1692 కేసులు, 2021లో 1702 కేసులు, 2022లో 2359 కేసులు, 2023లో 2361 కేసులు, 2024లో 2386 కేసులు, 2025లో ఇప్పటి వరకు సుమారు 350 వరకు క్షయ కేసుల నమోదయ్యాయని అధికారులు తెలిపారు. అలాగే సిద్దిపేట జిల్లాలో 2100 మంది క్షయ వ్యాధితో బాధపడుతున్నట్లు వైద్య శాఖ అధికారులు తెలిపారు. ఇందులో 40 మొండి క్షయ కేసులున్నట్లు గుర్తించారు. వైద్యులు సూచించిన విధంగా మందులు వాడుతూ నిత్యం పౌష్టికాహారం తీసుకుంటే 6 నుంచి 12 నెలల్లో వ్యాధి నయమయ్యే అవకాశం ఉంటుంది. ప్రత్యేక ట్రీట్‌మెంట్ యూనిట్లతో పాటు పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల్లో క్షయ వ్యాధి పరీక్షలు నిర్వహిస్తున్నారు. సిద్దిపేట మెడికల్ కళాశాలలో అత్యాధునిక టెక్నాలజీతో ఏర్పాటు చేసిన సీబీ న్యాట్ పరీక్షతో కేవలం రెండు గంటల్లో వ్యాధిని నిర్ధారించే వీలుంది.

రోగి ఖాతాలో జమ కాని నగదు

సర్కారు 'నిక్షయ్ పోషన్ యోజన' కింద పౌష్టికాహారం కోసం ప్రతి నెలా క్షయ రోగికి రూ.1000 ఖాతాలో జమ చేస్తుంది. ఇందుకు సంబంధించిన నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు విడుదల వుతాయి. వాటిని జిల్లా కలెక్టర్ అనుమతితో సంబంధిత రోగి ఖాతాలో నేరుగా జమ చేస్తారు. అయితే గత మూడు నెలలుగా నిధుల జమ కావడం లేదని రోగులు పేర్కొంటున్నారు. బడ్జెట్ లేని కారణంగా నగదు జమ నిలిచినట్లు అధికార వర్గాలు వివరించాయి. సిద్దిపేట జిల్లాలో మాజీ మంత్రి, హరీశ్‌రావు టీహెచ్ఆర్ పేరిట న్యూట్రిషన్ కిట్లను అందజేస్తూ బాసటగా నిలుస్తున్నారు.

క్షయ వ్యాధి లక్షణాలు

- రెండు వారాలకు మించి దగ్గు రావడం
- సాయంత్రం వేళలో జ్వరం రావడం
- రాత్రి వేళ జ్వరం, చెమటలు రావడం
- దగ్గుతున్నప్పుడు రక్తం పడడం
- ఆకలి లేకపోవడం, అలసట-నీరసం
- ఛాతినొప్పి, బరువు తగ్గడం



నీరుగారుతున్న సర్కారు లక్ష్యం

ప్రజల ఆరోగ్యం, సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు చేపడుతుంటే, క్షయ నివారణకు క్షేత్ర స్థాయికి తీసుకెళ్లాల్సిన యంత్రాంగం ఉదాసీనంగా వ్యవహరిస్తోందనే ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారుల పట్టింపులేక జిల్లాలో క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు మొక్కుబడిగా నిర్వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రాణాంతక వ్యాధిపై సంబంధిత క్షయ నివారణ విభాగం అధికారులు, వైద్య సిబ్బంది తమకు కేటాయించిన డివిజన్లు, ఏరియాల్లో పర్యవేక్షణ చేయాల్సి ఉండగా, జిల్లా కేంద్రానికే పరిమితమవుతూ అలసత్వంగా వ్యవహరిస్తున్నారే ఆరోపణలున్నాయి. దేశంలో క్షయ వ్యాధిని 2025 నాటికి పూర్తిగా పారదోలాలన్నదే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. ఇందు కోసం అధునాతన, ఖరీదైన యంత్ర పరికరాలు సమకూర్చింది. ఎప్పటికప్పుడు రోగులకు సరిపడా మందులు పంపుతున్నది. కానీ క్షయ వ్యాధిని పూర్తిగా పారదోలడానికి మాత్రం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పెద్దగా దృష్టి సారించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నది. కాగా, జిల్లాలో క్షయ నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని సంగారెడ్డి జిల్లా క్షయ నివారణ అధికారి(డీటీసీవో) డా.అరుణకుమారి తెలిపారు.



త్రిశూల్ దీక్షలో పాల్గొన్న బజరంగ్‌దళ్ కార్యకర్తలు

ధర్మరక్షణే బజరంగ్‌దళ్ లక్ష్యం

- వీహెచ్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా.రామ్‌సింగ్

సంగారెడ్డి అర్బన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి) : ధర్మరక్షణే బజరంగ్‌దళ్ లక్ష్యమని విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా.రామ్‌సింగ్, రాష్ట్ర ప్రచార ప్రసార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి అన్నారు. సంగారెడ్డి శివారులోని శ్రీవైకుంఠపురంలో బజరంగ్‌దళ్-విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో త్రిశూల్ దీక్షను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వారు మాట్లాడుతూ భారతీయ వైభవాన్ని ప్రపంచ దేశాలకు చాటేందుకు బజరంగ్‌దళ్ నిరంతరం సంఘర్షణ చేస్తుందన్నారు. ప్రతి బజరంగ్‌దళ్ కార్యకర్త తన మన ధన పూర్వకంగా ధర్మకార్యంలో పాలుపంచుకోవాలని సూచించారు. త్రిశూల్‌దీక్షను సుమారు 600 మంది కార్యకర్తలు పొందారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ధర్మ ప్రసార్ రాష్ట్ర సహ ప్రముఖ్ సుభాష్ చందర్, బజరంగ్‌దళ్ రాష్ట్ర ప్రశిక్షణ ప్రముఖ్ ముఖేష్, నాయకులు శ్రీధర్‌గౌడ్, జయరాంరెడ్డి, ప్రభుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మెదక్ చర్చిలో భక్తుల సందడి



మెదక్ కల్చరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మెదక్ సీఎస్ఐ చర్చిలో ప్రెసిబెటరీ ఇన్‌చార్జి బిషప్ శాంతయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భక్తులతో ప్రత్యేక ప్రార్థన మందిరం కిక్కిరిసింది. చర్చిఆవరణలో ఏర్పాటు చేసిన సిలువ వద్ద కొబ్బరి కాయలు కొట్టి, కొవ్వొత్తులు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. మత గురువులు భక్తులను ఆశీర్వచనాలందించారు. వేసవి కావడంతో కుటుంబ సభ్యులతో కలిసి విందు భోజనాలు చేస్తూ సేద తీరారు.

ఏషియన్ సాఫ్ట్‌బాల్ పోటీలకు మెదక్ జిల్లా క్రీడాకారిణి



సాయిసిరిని సన్మానిస్తున్న అజయ్‌కుమార్‌గౌడ్ తదితరులు

మనోహరాబాద్ మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఏషియన్ సాఫ్ట్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలలో మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం దండుపల్లి గ్రామానికి చెందిన క్రీడాకారిణి సాయి సాయిసిరి ఎంపికైనట్లు మెదక్ జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అజయ్ కుమార్‌గౌడ్ అన్నారు. ఈ నెల 26 నుంచి 31 వరకు తైవాన్ తైపిలో జరిగే పోటీల్లో భారత్ జట్టు తరఫున ఆడనుందన్నారు. ఈ మేరకు సాయిసిరిని మెదక్ జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యాంసుందర్ శర్మ సన్మానించగా, పలువురు అభినందించారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

- నందిని సిధారెడ్డి సహా పలువురు హాజరు
- మరోచోట మంత్రి పొన్నం ప్రభాకర్



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

రాయపోల్/హుస్నాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా పూర్వ విద్యార్థులు ఏ ఐదేళ్లకో పదేళ్లకో కలుసుకొని పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటారు. కానీ సిద్దిపేట డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసుకున్న అర్ధశతాబ్దం తర్వాత పూర్వ విద్యార్థులు కలుసుకుని అందరినీ ఆశ్చర్యపరిచారు. సిద్దిపేట డిగ్రీ కళాశాలలో 1972 నుంచి 75వ సంవత్సరంలో వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు డిగ్రీ చదివారు. వారంతా ఆదివారం రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామంలో కుటుంబసమేతంగా కలుసుకొని గత స్మృతులను నెమరేసుకున్నారు. పూర్వ విద్యార్థుల్లో ఒకరైన ప్రముఖ కవి నందిని సిధారెడ్డి పాల్గొని అందరినీ ఆత్మీయంగా పలకరించారు. వడ్డేపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ పోస్టుమాస్టర్ జగన్మోహన్‌రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

ఆనాటి మధుర స్మృతులను మననం చేసుకున్న మిత్రులు



హుస్నాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1974-75 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఆనందోత్సవాల మధ్య జరిగింది. 50 ఏళ్ల తరువాత కలుసుకున్న మిత్రులు ఆనాటి మధుర స్మృతులను మననం చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై మాట్లాడారు.

పేదల కోసమే విద్య, వైద్య సేవల విస్తరణ

- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు
- ఏడు అంబులెన్సులు అందజేత



జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు అంబులెన్స్ వాహనాన్ని అప్పగిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు

సంగారెడ్డి అర్బన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి) : పేదజల కోసమే విద్య, వైద్య సేవలు చేరువ చేస్తున్నట్టు మెదక్ ఎంపీ ఎం.రఘునందన్‌రావు తెలిపారు. సంగారెడ్డిలోని ఐబీలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ సహకారంతో మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ప్రభుత్వ ఆస్పత్రులకు ఏడు అంబులెన్సులు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ తన జన్మదినోత్సవం సందర్భంగా మొదటి దశలో పరిశ్రమల సహకారంతో అంబులెన్సులు ఇవ్వాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. సీఎస్ఆర్ నిధులను బయటి నియోజకవర్గాలకు ఇవ్వకుండా మెదక్ పార్లమెంట్ నియోజకవర్గానికే ఇచ్చి పార్టీలకతీతంగా అభివృద్ధి చేసేందుకు సహకరించాలని అధికారులు, పరిశ్రమల యాజమాన్యాలను కోరారు. అనంతరం సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, మెదక్, నర్సాపూర్, పటాన్‌చెరు, సంగారెడ్డి ఆస్పతులకు కేటాయించిన అంబులెన్సు వాహనాలు, వాటి పత్రాలను ఆయా ఆస్పత్రుల సూపరింటెండెంట్లకు ఎంపీ అందజేశారు. కార్యక్రమంలో సంగారెడ్డి జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.అనీల్ కుమార్, పటాన్‌చెరు ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.శ్రీనివాస్‌రెడ్డి, అరబిందో యాజమాన్యం నిత్యానందారెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు దేశ్‌పాండే, జగన్, డా.రాజుగౌడ్, నాయకులు ద్వారక రవి, నాగరాజు, వాసు తదితరులు పాల్గొన్నారు. కాగా, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎంపీ రంఘునందర్‌రావు జన్మదిన వేడుకలను పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు.

మల్లన్న సన్నిధిలో మాయగాళ్లు

- వసతిగదిలో బంగారు ఆభరణం, నగదు చోరీ

చేర్యాల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లన్న ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా చివరివారం జాతరను పురస్కరించుకుని భక్తులు భారీగా తరలివచ్చిన క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు భక్తుల సొమ్ము అపహరించుకుపోయారు. హైదరాబాదుకు చెందిన ఓ కుటుంబం శనివారం రాత్రి ఆలయ పరిధిలోని 44వ వసతి గదిని అద్దెకు తీసుకుని బసచేశారు. ఆదివారం కుటుంబసమేతంగా మల్లన్నను దర్శనం చేసుకుని గదికి చేరుకునేసరికి వెనక భాగం కిటికీ డోరుగుండా బ్యాగును అపహరించుకుపోయారు. అందులో తులంన్నర బంగారు నెక్లెస్, రూ.4,500 నగదు ఉన్నాయని పోలీసులకు సమాచారం అందించారు. ఇదిలా ఉండగా, శనివారం ఉదయం ఎమ్మెల్సీ కవిత మల్లన్న దర్శనం కోసం వచ్చిన క్రమంలో రద్దీలో పలువురి నగదు అపహరణకు గురవడంతో లబోదిబోమన్నారు. వరుస సంఘటనలు చోటు చేసుకున్న నేపథ్యంలో మల్లన్న సన్నిధిలో మాయగాళ్లను పట్టుకునేందుకు పోలీసులు ప్రత్యేక చొరవ వహించాలని భక్తులు కోరుతున్నారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

ఆదివారం జగిత్యాల జిల్లా గొవిందారం గ్రామానికి చెందిన పదేళ్ల బాలుడు ప్రణవ్ జాతరలో తప్పిపోయాడు. బాలుడిని గమనించి పోలీసులు మైక్‌లో అనౌన్స్‌మెంట్ చేశారు. దీంతో కంట్రోల్‌రూం వద్దకు చేరుకున్న కుటుంబసభ్యులకు బాలుడిని అప్పగించారు.

ఈతవనం దహనం



నంగునూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): గీత కార్మికులు పెంచుకున్న ఈతవనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు దహనం చేసిన సంఘటన నంగునూరు మండలం రాజగోపాలపేట గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని గీత కార్మిక సహకార సంఘానికి సంబంధించిన ఐదు ఎకరాలలో ఈత చెట్లు పెంచారు. చేతికొచ్చే దశలో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో సుమారుగా 300 చెట్లు దహనమైనట్లు గౌడ సంఘం నాయకులు తెలిపారు. గ్రామానికి చెందిన 20 కుటుంబాలు ఈత చెట్లను నమ్ముకుని జీవనం సాగిస్తున్నాయని, దహనం చేయడంతో పెద్ద ఎత్తున నష్టం వాటిల్లినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. చెట్లను దగ్ధం చేసిన వ్యక్తులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, జిల్లా కలెక్టర్, ఎక్సైజ్ అధికారులు స్పందించి ఆదుకోవాలని గౌడ సంఘం మాజీ అధ్యక్షుడు రంగు శ్రీనివాస్ గౌడ్ కోరారు.

సత్యసాయి ట్రస్టు సేవలు అజరామరం

- సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ డీసీపీ శ్వేత

కొండపాక, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కొండపాకలోని సత్య సాయి సంజీవని సెంటర్ ఫర్ చైల్డ్ హార్ట్‌కేర్ రీసర్చ్ సెంటర్ సేవలు ఎంతో గొప్పవని సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ డీసీపీ ఐపీఎస్ శ్వేత అన్నారు. ఆ ఆసుపత్రిలో ఈ నెల 13 నుంచి 22 వరకు మూడు సెషన్లో 23 చిన్నారులకు గుండె ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం గిఫ్ట్ ఆఫ్ లైఫ్ కార్యక్రమాన్ని నిర్వహించగా, ఆమె ముఖ్యఅతిథిగా హాజరై పిల్లల తల్లితండ్రులతో మాట్లాడి వారి అనుభవాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కడో మారుమూల ఉన్న ప్రాంత అభాగ్యులకు సైతం సత్యసాయి సేవలు అందించడం గొప్ప విషయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అనుభూతిని ఆనందాన్ని ఇస్తాయన్నారు. ఆసుపత్రి ఛైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ చిన్నారులకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తూ వారిని కాపాడడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి ప్రతినిధి జగన్నాథ శర్మ, సత్య సాయి బాలికల కళాశాల ప్రతినిధి పూర్ణిమ, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.



ఆపరేషన్లు చేయించుకున్న చిన్నారులతో కేక్ కట్ చేయిస్తున్న శ్వేత

మహిళా జాబ్‌మేళాకు విశేష స్పందన



మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట కల్చరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేటలో నిర్వహించిన మహిళా జాబ్‌మేళాకు మంచి స్పందన లభించింది. మాజీ మంత్రి, ఎమ్మెల్యే చొరవతో ఆదివారం సిద్దిపేటలోని విపంచి కళానిలయంలో జాబ్ మేళాను నిర్వహించారు. హైదరాబాద్‌లోని ప్రముఖ ఎలక్ట్రానిక్ కంపెనీ ఫాక్స్‌కాన్‌లో ఉద్యోగాల కోసం నిర్వహించిన నిర్వహించిన ఈ మేళాకు మహిళలు, యువతులు దాదాపు 500కు పైగా హజరయ్యారు. ఈ కార్యక్రమానికి మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు హజరై మాట్లాడారు. జీవితం మొదటి అడుగుతోనే ప్రారంభమవుతుందని, ఉద్యోగం పెద్దదా చిన్నదా అనే అనుమానాలు వద్దని, అడుగు బయటకు వస్తే విజయం ఖాయమని స్పష్టం చేశారు. ఆర్థిక స్వాతంత్ర్యంతోనే సమస్యలను ఎదుర్కొనే శక్తి వస్తుందన్నారు. సిద్దిపేటలో కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం ట్రైనింగ్ ఇచ్చినప్పుడు 250 మంది కానిస్టేబుళ్లుగా, 600 మంది డీఎస్సీ, గ్రూప్స్‌లో 33 మంది ఉద్యోగాలు సాధించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమానికి స్పాన్సర్స్‌గా సుదర్శ అసోసియేట్స్, ప్రతిభ డిగ్రీ కళాశాల వ్యవహరించారు.

జాబ్ రావటం సంతోషంగా ఉంది



నేను సిద్దిపేటలో డిగ్రీ బీబీఏ పూర్తిచేశాను. మహిళా జాబ్‌మేళా ఉందని తెలిసి వచ్చాం. డిగ్రీ పూర్తికాగానే జాబ్ రావడం సంతోషంగా ఉంది. కంపెనీ టర్మ్స్ అండ్ కండీషన్స్ బాగున్నాయి. మొదటిసారి జాబ్ లైఫ్‌లోకి అడుగుపెట్టబోతున్నాం. చాలా ఉత్సాహంగా ఉంది. హరీశ్‌రావు సార్ చెప్పినట్లు చిన్నదా పెద్దదా జాబ్ చేయాలని చెప్పటంతో కాన్ఫిడెన్స్ వచ్చింది.

-లాస్య, సిద్దిపేట

అనారోగ్యంతో మహిళ ఆత్మహత్య



రత్నమ్మ (ఫైల్)

సంగారెడ్డి క్రైం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్య సమస్యల కారణంతో మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం చోటు చేసుకుంది. పట్టణ సీఐ రమేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొండాపూర్ మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన గూడెం రత్నమ్మ(40) కొడుకు గత ఏడాది క్రితం మరణించాడు. రత్నమ్మ కూడా కొంతకాలంగా అనారోగ్య సమస్యలు బాధపడుతున్నది. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె ఆదివారం మల్లేపల్లి నుంచి సంగారెడ్డి పట్టణానికి వచ్చి శివారలోని మహబూబ్‌సాగర్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. కుటుంబీకుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో రైతు మృతి



బాలయ్య(ఫైల్)

పాపన్నపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన సంఘటన మెదక్ జిల్లా మండల కేంద్రం పాపన్నపేటలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన బట్టి బాలయ్య (57) పొలాన్ని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పొలం వద్ద బోరు మోటారు పని చేయకపోవడంతో ఆదివారం స్టార్టర్ వద్ద రిపేర్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. అటుగా వెళ్లిన స్థానికులు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. భార్య కిష్టమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా, మృతుడు బాలయ్య కుటుంబానికి రూ.5 లక్షల నష్టపరిహారాన్ని ప్రభుత్వం చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే పటోళ్ల శశిధర్ రెడ్డి డిమాండ్ చేశారు. విద్యుత్ నియంత్రణ మండలి సభ్యునిగా మృతుడి కుటుంబానికి అండగా ఉంటానన్నారు.

బావిలోకి జారిపడి..

మద్దూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : బావిలోకి జారిపడి రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని వల్లంపట్ల గ్రామంలో ఆదివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వంగపల్లి నర్సింహులు(47) ఆదివారం తెల్లవారు జామున పొలానికి నీళ్ల పెట్టాడు. బావిలో నీళ్లు ఉన్నాయా లేవా అని తొంగి చూసే క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడి మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

నీట మునిగి బాలుడు..



దుర్గయ్య మృతదేహం

పాపన్నపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : నీట మునిగి బాలుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని మల్లంపేటలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం... గ్రామానికి చెందిన కురుమ సాయిలు కుమారుడు దుర్గయ్య(12) శనివారం మధ్యాహ్నం స్నానం చేసేందుకు స్థానిక రెడ్ల చెరువులోకి దిగగా, ప్రమాదవశాత్తూ నీట మునిగి మృతి చెందాడు. సాయంత్రమైనా ఇంటికి రాకపోయేసరికి కుటుంబీకులు చుట్టు పక్కల వెతికారు. ఆదివారం చెరువు వద్ద దుర్గయ్య దుస్తులు కనిపించగా, చెరువులో గాలించగా మృతదేహాన్ని వెలికితీశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. బాలుడి తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చేపల వేటకు వెళ్లి..



అరవింద్ మృతదేహం

జగదేవ్‌పూర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కుంటలో చేపల వేట కోసం వెళ్లిన ఓ బాలుడు నీట మునిగి మృతి చెందాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం మాందాపూర్ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మాందాపూర్ గ్రామానికి చెందిన నిమ్మల వెంకటేశం ప్రమీల దంపతులకు ముగ్గురు కుమారులు నరేష్, అరవింద్(17), సంతోష్ ఉన్నారు. అరవింద్ తిగుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతూ బీసీ హాస్టల్‌లో ఉంటన్నాడు. కాగా ఆదివారం సెలవు దినం కావడంతో అరవింద్ అతని తమ్ముడు సంతోష్ తోపాటు చిన్నాన్న కుమారులైన మరో ఇద్దరితో కలిసి మాందాపూర్‌లోని బతుకమ్మ కుంటలో చేపలు పట్టడానికి వెళ్లారు. అరవింద్ చేపల కోసం కుంటలోకి దిగడంతో ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. సమాచారం అందుకున్న గ్రామస్థులు అక్కడికి చేరుకుని అరవింద్ మృతదేహాన్ని వెలికితీశారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బైక్‌ను ఢీకొన్న లారీ

- భార్య మృతి, భర్తకు తీవ్ర గాయాలు

గజ్వేల్ రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): దంపతులిద్దరు ప్రయాణిస్తున్న బైకుని లారీ ఢీకొన్న ఘటనలో భార్య అక్కడికక్కడే మృతి చెందగా, భర్తకు తీవ్ర గాయాలైన ఘటన మండల పరిధిలోని అహ్మదీపూర్ వద్ద ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గజ్వేల్ ఆర్అండ్ఆర్ కాలనీ బ్రహ్మణ బంజేరుపల్లి గ్రామానికి చెందిన సుతారి కిష్టయ్య, సత్తవ్వ దంపతులిద్దరు బైక్‌పై గజ్వేల్ నుంచి కాసులాబాద్‌కు కిష్టయ్య సోదరుడు(అన్న) మృతి చెందగా మూడు రోజుల కార్యక్రమానికి వెళ్తున్నారు. మార్గమధ్యలో అహ్మదీపూర్ గ్రామ శివారు ఇండియన్ పెట్రోల్ బంక్ వద్ద దంపతులిద్దరు ప్రయాణిస్తున్న బైక్‌ని కొల్గూర్ నుంచి వస్తున్న లారీ ఢీకొట్టి, వారి పైనుంచి వెళ్లడంతో సత్తవ్వ(48) అక్కడికక్కడే మృతి చెందింది. భర్త కిష్టయ్యకు కాళ్లు, చేతులు విరగడంతోపాటు తీవ్ర గాయాలు కాగా మొదట గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అతడి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు తెలిసింది. వారికి ఇద్దరు కుమారులు, కూతురు ఉండగా కూతురి వివాహమైంది. కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి..



వ్యక్తి మృతదేహం

జిన్నారం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వాహనం ఢీకొన్న ఘటనలో గుర్తు తెలియని వ్యక్తి మరణించిన ఘటన గడ్డపోతారంలో చోటు చేసుకుంది. సీఐ రవీందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గడ్డపోతారం గ్రామ శివారులో ఆదివారం గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టిన ఘటనలో 40ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మరణించాడు. ఈ మేరకు ప్రైవేటు పరిశ్రమ ఉద్యోగి సతీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

న్యూస్ బాక్స్

జోగిపేట బృందావన్ కాలనీ అధ్యక్షుడిగా శ్రీకాంత్

జోగిపేట రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : జోగిపేట బృందావన్ కాలనీ 2025-27 సంవత్సరానికిగాను నూతన అధ్యక్షులుగా అల్లే శ్రీకాంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం రాత్రి కాలనీ పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా బసవ సత్యప్రకాశ్, ఉపాధ్యక్షులుగా కోరబోయిన నాగరాజు, సయ్యసాయి, రాజేందర్ రెడ్డి ఎన్నుకున్నారు.

దండోర ఉద్యమం చరిత్రాత్మకం

జహీరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : దండోర ఉద్యమం చరిత్రాత్మకమని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు అబ్రహంమాదిగ పేర్కొన్నారు. ఎస్సీవర్గీకరణ సాధించిన నేపథ్యంలో ఆదివారం మండలంలోని కాశీంపూర్ గ్రామంలో ఎమ్మార్పీఎస్ నాయకులు జరుపుకున్నారు.

'దీక్షాధారులు నియమ, నిష్టలు పాటించాలి'

నారాయణఖేడ్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ దీక్షలు స్వీకరించిన వారు విధిగా నియమ, నిష్టలు పాటించాలని అఖిల భారత సాధుసంతుల రాష్ట్ర ప్రతినిధి, ఖేడ్ మండలం కొండాపూర్ హనుమాన్ ఆలయ పీఠాధిపతి సంగ్రాంమహరాజ్ అన్నారు. కొండాపూర్ హనుమాన్ ఆలయంలో ఆదివారం హనుమాన్ అర్ధ మండల దీక్షల స్వీకరణ కార్యక్రమాన్ని ఆయన చేతులమీదుగా మాలాధారణ చేశారు.

దీక్షలో ఆర్యవైశ్య సంఘం

నర్సాపూర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : నల్లవల్లి ప్రాంతంలో డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా ఏర్పాటుచేసిన దీక్షలో ఆదివారం స్థానిక ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు పాల్గొని మద్దతు పలికారు. ఈ దీక్షలో మాజీ జడ్పీటీసీ బి.శ్రీనివాస్‌గుప్తా, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రమశిక్షణ అవసరం

కంగ్టి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతో పాటు క్రమ శిక్షణ ఎంతో ముఖ్యమని కంగ్టి సీఐ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన కంగ్టిలోని లిటిల్ స్టార్ పాఠశాలలో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ విజయ్‌కుమార్, పాఠశాల కరస్పాండెంట్ చంద్రకాంత్, నరేష్, సుధీర్, అనిల్, మనోజ్ పాటిల్, అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు: ఎస్ఐ

మెదక్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ నారాయణగౌడ్ హెచ్చరించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని ఖాజాపూర్‌తండా, ఎస్ కొండాపూర్, సూరారం తదితర గ్రామాల్లోని వాగులు, కాలువల నుంచి టిప్పర్లు, ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్నారని సమాచారం ఉన్నదన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళాలు

చిన్నశంకరంపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దిరాజు పెద్దమ్మ ఆలయ నిర్మాణాన్ని చేపట్టారు. ఆదివారం చిన్నశంకరంపేటకు చెందిన దాతలు మేడి శ్రీమన్ రూ.3.60 లక్షలు, కంజర్ల చంద్రశేఖర్ రూ.50 వేల విరాళాన్ని ముదిరాజ్ సంఘం సభ్యులకు అందజేశారు.

'రాజీవ్ యువ వికాస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి'

జిన్నారం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం యువత, నిరుద్యోగుల కోసం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్డె కృష్ణ అన్నారు. ఆదివారం జిన్నారం కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 5 లక్షల మంది యువత కోసం 60 నుంచి 80 శాతం సబ్సిడీతో అమలు చేసే పథకాన్ని ఉపయోగించుకోవాలన్నారు.

సేవా కార్యక్రమం అలవర్చడం కోసమే 'ఎన్ఎస్ఎస్'

నర్సాపూర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు విద్యార్థుల్లో సేవా దృక్పథం అలవర్చాలనే ఉద్దేశంతో ఎన్ఎస్ఎస్ పనిచేస్తుందని ఎన్ఎస్ఎస్ రాష్ట్ర లైజన్ అధికారి భాస్కర్ పేర్కొన్నారు. ఆదివారం పెద్దచింతకుంట ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థుల ఆధ్వర్యంలో రెడ్డిపల్లిలో వారంరోజుల పాటు నిర్వహించనున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు.

ఆర్థిక చేయూత

మెదక్ కల్చరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : మెదక్ మండల మక్తభూపతిపూర్ గ్రామానికి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు రాజు ఇటీవల మృతిచెందాడు. అతడి కుటుంబ నేపథ్యం, ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న గ్రామంలోని పెద్దలు, యువత, ఉద్యోగులు, గ్రామ కార్యదర్శి, బదిలీపై వెళ్లిన కార్యదర్శి తలా చేయివేసి రూ.28,750 వేలను ఆదివారం రాజు కుమార్తె, కుమారుడికి అందజేశారు.

మందుబాబులకు అడ్డాగా క్రీడా ప్రాంగణాలు

- మద్యం సీసాలు పడేస్తూ.. పగులగొడుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు



వెంకట్రావుపేటలో ఆలయంలో, ప్రభుత్వ పాఠశాల సమీపంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం



పల్లె ప్రకృతివనంలో మద్యం సేవించి ఖాళీ బాటిళ్లను పారవేసిన దృశ్యం(వృత్తంలో)

అల్లాదుర్గం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు, పల్లె ప్రకృతివనాలు అధికారుల పర్యవేక్షణాలోపంతో మందుబాబులకు అడ్డాగా మారాయి. అల్లాదుర్గం మండలం వెంకట్రావుపేట గ్రామంలోని ఓ ఆలయం వద్ద క్రీడా ప్రాంగణాన్ని, అలాగే మరో ఆలయ ప్రాంగణంలో పల్లె ప్రకృతివనాన్ని ఏర్పాటు చేశారు. ఏడాదికాలంగా అధికారుల పాలనలో పర్యవేక్షణ కరువైంది. దీంతో మందుబాబులు అడ్డాగా మార్చుకుని ఎక్కడపడితే అక్కడ మద్యం సేవిస్తూ.. బాటిళ్ల పారేయడంతో పాటు పగలగొడుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి ప్రభుత్వ ఆశయానికి చేయూతనిచ్చేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రభుత్వ పథకాలకు ప్రాధాన్యం: ఎమ్మెల్యే



ఖేడ్‌లో పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గుండు లక్ష్మణ్‌ను సన్మానించిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా తమ ప్రభుత్వం పథకాలకు ప్రాధాన్యం ఇస్తుందని స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. ఆదివారం ఖేడ్‌లోని క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ హయాంలో రాయితీపై వ్యవసాయ పరికరాలను అందించగా... బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక రైతుబంధు పేరిట వెంచర్లు, గుట్టలు, వివిధ అవసరాలకు ప్రభుత్వం సేకరించిన భూములతో పాటు వందల ఎకరాలున్న రైతులకు సైతం పెట్టుబడి సహాయాన్ని అందించి రాయితీపై పరికరాల పంపిణీ నిలిపివేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ తాజామాజీ వైస్ చైర్మన్ దారం శంకర్, నాయకులు తాహేర్‌అలీ, రమేష్‌చౌహాన్, ముంతాజ్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన గుండు లక్ష్మణ్‌ను ఎమ్మెల్యే సన్మానించారు.

సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట: మహిపాల్‌రెడ్డి



లబ్ధిదారులకు ఎల్‌వోసీలను అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజల సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మెరుగైన వైద్యమందించేందుకు ప్రభుత్వం జారీచేసిన ఎల్‌వోసీలను ఆదివారం క్యాంపు కార్యాలయంలో అందజేసి మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసే మూడుసార్లు తనను శాసనసభ్యుడిగా ఎన్నుకున్నారన్నారు. ప్రజల రుణం తీర్చుకునేందుకు అహర్నిషలు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, పటాన్‌చెరు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, నాయకులు శంకర్ రెడ్డి, శంకర్‌గౌడ్ పాల్గొన్నారు. అలాగే పటాన్‌చెరు నియోజకవర్గ ఇఫ్తార్ విందును జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్: ఎమ్మెల్యే



పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఇఫ్తార్‌విందులో ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందులని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఇఫ్తార్‌విందు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జహీరాబాద్ ప్రాంతంలో అందరం కలిసిమెలిసి ప్రశాంతంగా ఉంటామని, ఇదే సంస్కృతిని నిరంతరం కొనసాగిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, ఆయా మండలాల అధ్యక్షులు సంజీవరెడ్డి, నర్సింలు, నారాయణ, వెంకటేశం, రాష్ట్ర నాయకులు షేక్‌ఫరీద్, గుండప్ప, నాయకులు అల్లాడి నర్సింలు, విజయ్‌కుమార్, మశ్చేందర్ తదితరులు పాల్గొన్నారు.

'పల్లె సంజీవయ్యపై దాడిచేసిన వారిని శిక్షించాలి'

పుల్‌కల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): దళిత నాయకుడు, జోగిపేట ఏఎంసీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నేత పల్లె సంజీవయ్యపై దాడిచేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బుచ్చేంద్రమాదిగ డిమాండ్ చేశారు. దళిత సంఘాల నాయకులు నాగిరెడ్డిపల్లి కృష్ణంరాజు, ఎర్రోల్ల పోచయ్య, వై.కృష్ణ, నాగులపల్లి శ్రీహరిలతో కలిసి ఆదివారం గొంగ్లూర్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సంజీవయ్య స్వగ్రామమైన పుల్కల్ మండలం గొంగ్లూర్‌లో ఏపీలోని విజయవాడకు చెందిన సినీనిర్మాత మేడికొండ వెంకటమురళీకృష్ణ స్థానిక రైతుల భూములను కబ్జా చేస్తూ దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సంజీవయ్య ఆయన సోదరుడు బాలయ్య, తనయుడు క్రాంతి కళ్లల్లో కారం చల్లి మురళీకృష్ణ అనుచరులు మారణాయుధాలతో దాడి చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. దాడికి పాల్పడిన వారిని అరెస్ట్ చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కింద కేసు నమోదు చేయాలన్నారు. సినీ నిర్మాత మేడికొండ వెంకట మురళీకృష్ణ ఆగడాలపై రాష్ట్ర మంత్రి దామోదర రాజనరసింహ, కలెక్టర్, ఎస్పీల దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఇదిలా ఉండగా పల్లె సంజీవయ్యపై జరిగిన దాడిని గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు జైపాల్‌నాయక్ వేర్వేరుగా తీవ్రంగా ఖండించారు. ఈ సమావేశంలో మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా గౌరవ అధ్యక్షుడు వీరయ్య పాల్గొన్నారు.

'మురుగు కాలువలు నిర్మించాకే రోడ్డు వేయాలి'

రామాయంపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : మురుగు కాలువలు నిర్మించనిదే రోడ్డు పనులు చేయొద్దంటూ కాలనీవాసులు ఆదివారం గొడవపడ్డారు. సుమారు 200 మంది హమాలీ కాలనీ వద్ద గుమిగూడి వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఇరువర్గాలను ఘర్షణ పడొద్దంటూ సముదాయించారు. రోడ్డుతో పాటే వెంకటేశ్వర కాలనీ వరకు ఇరువైపులా కాలువలు నిర్మించకపోతే.. పనులు అడ్డుకుంటామంటూ హెచ్చరించారు. ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి డ్రైనేజీ కోసం నిధులు తెచ్చే ప్రయత్నం చేస్తామని టీపీసీసీ కార్యదర్శి సుప్రభాత్, మాజీ ఎంపీపీ రమేష్‌రెడ్డి హమాలీ కాలనీవాసులకు నచ్చజెప్పారు. దీంతో రెండు గంటలపాటు ముదిరిన ఇరువర్గాల గొడవ సద్దుమణిగింది.

ముగిసిన రేణుకాఎల్లమ్మ జాతర

మునిపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మన్సన్‌పల్లి గ్రామ శివారులో గల రేణుకాఎల్లమ్మ జాతర ఆదివారంతో ముగిసింది. ఇందులో భాగంగా మండలంలోని వివిధ పార్టీలకు చెందిన నాయకులు, భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు పైతర మీనాక్షిసాయికుమార్, మల్లికార్జున్‌పాటిల్, మాజీ ఎంపీటీసీలు పాండు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరుచోట్ల ముగ్గురి అదృశ్యం



హసీల్‌బాండ్ మోసీన్

జహీరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యమయ్యారు. ఈ సంఘటన జహీరాబాద్, మనోహరాబాద్ మండలాల్లో చోటు చేసుకున్నది. జహీరాబాద్ పట్టణంలోని రాంనగర్‌కు చెందిన హసీల్ బాండ్ మోసీన్(24) ఆటోడ్రైవర్. ఈ నెల 17న (టీఎస్ 15 యూఏఫ్ 7537) నెంబరు గల ఆటోను తీసుకుని కిరాయి నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో హసీల్‌బాండ్ భార్య సహారా ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కాశీనాథ్ తెలిపారు.

రాంనగర్‌లో మహిళ



నిరుషా(ఫైల్)

జహీరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రాంనగర్‌కు చెందిన మహిళ అదృశ్యమైంది. ఈనెల 18న ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆదివారం తల్లి రాథోడ్ కవిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కాశీనాథ్ తెలిపారు.

కూచారంలో యువకుడు..



పృథ్వీరాజ్ (ఫైల్)

మనోహరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): స్నేహితుడి పుట్టినరోజుకు వెళ్లిన యువకుడు అదృశ్యమైన సంఘటన మండల పరిధి కూచారంలో చోటు చేసుకున్నది. ఎస్ఐ సుభాష్‌గౌడ్ వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ మండలం బహదూర్‌పల్లి గ్రామానికి చెందిన కంకిపాటి సుబ్బరాజ్ భార్య, కుమారుడు పృథ్వీరాజ్(28)తో కలిసి బతుకుదెరువు కోసం మనోహరాబాద్ మండలం కూచారం గ్రామానికి గతేడాది వచ్చారు. పృథ్వీరాజ్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈనెల 20న స్నేహితుడి పుట్టినరోజు ఉన్నదని రాత్రి 11.45 గంటలకు ఇంటినుంచి వెళ్లి తిరిగిరాలేదు. తల్లిదండ్రులు ఫోన్‌చేయగా.. స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో తండ్రి సుబ్బరాజ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తూప్రాన్‌లో ట్రాక్టర్ చోరీ

తూప్రాన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : ఇంటి ముందు ఉంచిన ట్రాక్టర్ చోరీకి గురైన సంఘటన తూప్రాన్ పట్టణంలో ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పట్టణంలోని బ్రాహ్మణ వీధికి చెందిన బిదురు రాజశేఖర్ శర్మ వ్యవసాయ పనుల నిర్వహణ కోసం ట్రాక్టర్ (టీఎస్35 డీ 4688) కొనుగోలు చేశాడు. అయితే శనివారం రాత్రి ఇంటి ముందు పార్కు చేసిన ట్రాక్టర్ తెల్లవారుజామున చూసేసరికి కనిపించలేదు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అనారోగ్యంతో యోగా గురువు మృతి



రామచంద్రం (ఫైల్)

చేగుంట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : ఎంతోమందికి యోగా శిక్షణ ఇచ్చిన యోగా గురువు, విశ్రాంత ఉపాధ్యాయుడు రామచంద్రం(75) కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. యోగాలో శిక్షణ పొందిన విద్యార్థులు, తోటి ఉపాధ్యాయులు ఆయన పార్థివదేహానికి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. రామచంద్రం యోగా శిక్షణలో గతంలో రాష్ట్రపతి చేతులమీదుగా అవార్డులు అందుకున్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

పుల్‌కల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో మృతి చెందిన 108 పైలట్ శ్రీనివాస్ కుటుంబానికి ఆర్థిక సహాయం చేశారు. మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం ముంద్రాయికి చెందిన కుమ్మరి శ్రీనివాస్ మండల కేంద్రం కౌడిపల్లి 108 అంబులెన్స్ పైలట్‌గా 12 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. శనివారం విధి నిర్వహణలో ఉండగా గుండెపోటుకు గురై మృతిచెందారు. సంగారెడ్డి జిల్లాలోని చౌటకూర్ 108 అంబులెన్స్‌పై పైలట్‌గా విధులు నిర్వహిస్తున్న రాజ్‌కుమార్, మరో పైలట్ సాయిబాబాగౌడ్, ఈఎంటీ సిబ్బంది, కొంతమంది చందాలు చేశారు. ఆదివారం అంత్యక్రియలకు హాజరై రూ.10 వేలు నగదును కుటుంబసభ్యులకు అందజేశారు.

నోటీసులు ఇచ్చినా ఆగని అక్రమ నిర్మాణాలు



ఇంద్రకరణ్‌లో అక్రమంగా నిర్మిస్తున్న ప్రహరీ

కంది, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : కంది మండల పరిధిలోని ఇంద్రకరణ్‌లో ప్రత్యేక అధికారుల పాలన నవ్వులపాలవుతున్నది. గ్రామ శివారులో అనుమతులు లేకుండా ఆదివారం ప్రహరీల నిర్మాణం చేపడుతున్నా పంచాయతీ అధికారులు చూసీ చూడనట్లు వదిలేస్తున్నట్లు గ్రామస్థులు విమర్శిస్తున్నారు. ఈ విషయమై గ్రామ కార్యదర్శి ఎంఎ ఎస్ వాణిని వివరణ కోరగా.. సదరు అక్రమ నిర్మాణానికి శనివారం నోటీసులు ఇచ్చామని, అయినా నిర్మాణం చేపడితే చర్యలు తీసుకుంటామన్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితోనే పోరాటాలు చేద్దాం



సంగారెడ్డిలో భగత్‌సింగ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అధ్యక్షుడు సురేష్

సంగారెడ్డి అర్బన్/సంగారెడ్డి రూరల్/నారాయణఖేడ్/జహీరాబాద్/పెద్దశంకరంపేట/జోగిపేట రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలో భగత్‌సింగ్ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేశ్, ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షుడు శ్రీధర్‌మహేంద్ర నివాళులర్పించారు. భగత్‌సింగ్, సుఖదేవుల 94వ వర్ధంతి సందర్భంగా సంగారెడ్డిలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఆధ్వర్యంలో భగత్‌సింగ్ విగ్రహానికి సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్ భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. సంగారెడ్డిలో సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల చిత్రపటాలతో ర్యాలీ నిర్వహించారు. నారాయణఖేడ్‌లోని రాజీవ్ చౌక్ సమీపంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాణిక్ ఆధ్వర్యంలో, జహీరాబాద్ పట్టణంలో సీపీఎం ఏరియా కార్యదర్శి రాంచందర్ ఆధ్వర్యంలో, మండల కేంద్రమైన పెద్దశంకరంపేటలో భగత్‌సింగ్ విగ్రహానికి పలువురు పూలమాలవేసి నివాళులర్పించారు. భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల వర్ధంతి సందర్భంగా జోగిపేట పోలీస్‌స్టేషన్‌లో మహా రక్తదాన శిబిరం నిర్వహించారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న రాజిరెడ్డి

మెదక్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మాసాయిపేట మండల కేంద్రంలోని వడ్డెర కాలనీలో రూ.14 లక్షలతో సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ కృష్ణారెడ్డి, శ్రీకాంత్, ఉపసర్పంచ్ నాగరాజు, వడ్డెర కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

బాల్యం నుంచే విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

పటాన్‌చెరు రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : బాల్యం నుంచే విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్సీ అంజిరెడ్డి కోరారు. ఆదివారం నందిగామ గ్రామంలో పోస్టర్ కిడ్స్ ప్లే స్కూల్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. నేటి విద్యార్థులకు విద్యతో పాటు సామాజిక, క్రీడలపై కూడా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్ గుప్తా, జిల్లా నాయకులు అల్లం రాజిరెడ్డి, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు వెంకటయ్య, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

'జై బాపు-జై భీమ్-జై సంవిధాన్'లో నీలం మధు



సంగారెడ్డిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సమావేశంలో నీలం మధు

సంగారెడ్డి రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం నిర్వహించిన జై బాపు-జై భీమ్-జై సంవిధాన్ సమావేశంలో కాంగ్రెస్ నాయకుడు నీలం మధు పాల్గొని మాట్లాడారు. అహింసా పద్ధతిలో పోరాడుతూ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచి స్వాతంత్ర్యం సిద్ధించిన మహాత్మాగాంధీతో పాటు రాజ్యాంగాన్ని రచించిన అంబేడ్కర్‌ను బీజేపీ, ఆర్ఎస్ఎస్ అవమానిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనరెడ్డి, ఫిషరీస్ సొసైటీ చైర్మన్ మెట్టు సాయికుమార్, ఫుడ్ కార్పోరేషన్ చైర్మన్ ఫహీం, టీపీసీసీ కార్యదర్శి తోపాజి అనంతకిషన్ పాల్గొన్నారు.

సీఎంకు వినూత్న చిత్రపటం బహూకరణ



రేవంత్‌రెడ్డికి చిత్రపటాన్ని అందజేస్తున్న ప్రభాకర్

నారాయణఖేడ్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : టీపీసీసీ సభ్యులు కర్నే ప్రభాకర్ తన పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వినూతన్న రీతిలో అక్షర మాలతో తయారు చేయించిన సీఎం చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి శ్రీనివాస్‌ను అభినందించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

ఏబీ ఇన్‌బెవ్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడిగా చుక్క రాములు

పుల్‌కల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం శివంపేట గ్రామ శివారులోని ఏబీ ఇన్‌బెవ్ ఇండియా (చార్మినార్ బీర్) పరిశ్రమ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడిగా సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం పరిశ్రమ ఆవరణలో జరిగిన 11వ మహాసభలో పలు తీర్మానాలు చేసి ఆమోదించారు. అనంతరం పరిశ్రమలో యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బీరం మల్లేశం, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి.బాగారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ప్రసన్నరావు, ఆఫీస్ బేరర్స్‌గా ఏర్పుల నాగభూషణం, పుర్ర మల్లారెడ్డి, కలాలి విష్ణువర్ధన్‌గౌడ్, చంద్రయ్యలను ఎన్నుకున్నారు. వీరితో పాటు కమిటీ సభ్యులుగా మిరియాల విఠల్, బండని విఠల్, చిట్టిపు లక్ష్మారెడ్డి, వెంకటేశం, వై.మురళీ, ఎండీ జలీల్ ఎన్నికయ్యారు.

ఇంటర్ స్పాట్‌ను తనిఖీ చేసిన బోర్డు డిప్యూటీ సెక్రెటరీ

సంగారెడ్డి అర్బన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న ఇంటర్ మూల్యాంకన కేంద్రాన్ని ఇంటర్మీడియట్ బోర్డు డిప్యూటీ సెక్రెటరీ, జిల్లా అబ్జర్వర్ యాదగిరి ఆకస్మిక తనిఖీ చేశారు. మూల్యాంకన కేంద్రంలో జరుగుతున్న జవాబు పత్రాల మూల్యాంకనాన్ని క్షుణంగా పరిశీలించారు. స్క్రూటినైజర్, ఎగ్జామినర్లు, స్పాట్ అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఇంటర్ స్పాట్ నిర్వహణపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవిందరామ్, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

ఆరోగ్య శిబిరానికి అపూర్వ స్పందన

- 800 రోగులకు ఉచిత పరీక్షలు

రామాయంపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : రామాయంపేటలో జరిగిన ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. 800 రోగులు చేరుకొని వివిధ రకాల పరీక్షలు చేయించుకున్నారు. పట్టణానికి చెందిన సంఘ సేవకుడు పుట్టి సందీప్ తన తల్లి స్మారకార్థం శిబిరాన్ని నిర్వహించాడు. హైదరాబాద్, రామాయంపేటకు చెందిన ప్రత్యేక వైద్యులు ఆకుల విక్రం, బిజ్జు గోవింద్, కృష్ణారెడ్డి, ఎల్క సురేష్, సుప్రియలు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, టీపీసీసీ కార్యదర్శి సుప్రభాత్, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

50 మందికి ఉచిత కంటి శస్త్ర చికిత్సలు

నారాయణఖేడ్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ ప్రాంతానికి చెందిన 50 మందికి హైదరాబాద్ నానక్‌రాంగూడలోని శంకర ఆసుపత్రిలో ఉచిత కాటారాక్ట్ శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహించి ఆదివారి ఖేడ్‌కు తీసుకొచ్చారు. భగవాన్ సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా సత్యసాయి సేవాసమితి, శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 21న ఖేడ్‌లో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 105 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో 51 మందికి హైదరాబాద్‌లో శస్త్రచికిత్సలు చేయించి ఖేడ్‌కు తీసుకొచ్చారు.

'ప్రభుత్వం మొండి వైఖరి మానుకోవాలి'

చిన్నశంకరంపేట/నిజాంపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : ఆశావర్కర్ల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి మానుకోవాలని సంఘం అధ్యక్షురాలు దేవమ్మ అన్నారు. ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 24న చలో హైదరాబాద్ కమిషనరేట్ ముట్టడికి వెళ్లకుండా ఆశావర్కర్లను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. నిజాంపేటలో ఆశా వర్కర్లు లక్ష్మి, సంతోషి, బాలమణి, అనిత గౌరిలను పోలీసులు ముందస్తు అదుపులోకి తీసుకున్నారు.